

పది పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డిఇఒ

విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పది పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని డిఇఒ సాయిరాం ఆదేశించారు. అనంతపురం జిల్లాలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు జరగనుండడంతో నగరంలోని పలు కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం గురువారం ముందస్తుగా తనిఖీ చేశారు. నగరంలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, లక్ష్మీ సినర్జ్ పాఠశాల, కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల, నారాయణ, చర్చి స్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. పాఠశాలల్లో సౌకర్యాలు, బల్లలు ఏర్పాటు గురించి ఆయా పాఠశాలల యాజమాన్యంతో చర్చించారు.

ఎక్కడ వేసిన గొంగలి అక్కడే..!



అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం

2014 ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి కేంద్రంలోని బిజెపి అధికారంలోకి వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ మరోమారు అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి రావడానికి ముందు ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం హామీలన్నింటినీ అమలు చేస్తామని ప్రకటించింది. అయితే ఈ హామీల అమలు, బిజెపి విధానాల వల్ల జిల్లాకు జరుగుతున్న అన్యాయం, నష్టంపై 'ప్రజాశక్తి' వరుస కథనాలను అందివ్వనుంది. ఈ నేపథ్యంలోనే ప్రపథమ హామీ అయిన విభజన చట్టంలో జిల్లాకు వచ్చిన కేంద్రీయ విశ్వవిద్యాలయం చూస్తే అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది.

బాలారిష్టాలు దాటని కేంద్రీయ విశ్వవిద్యాలయం

నిధుల కేటాయింపులు నిల్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం అనంతపురం జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు అయింది. ఇది ప్రారంభమై నాలుగేళ్లు పూర్తయినా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. బడ్జెట్‌లో కేటాయింపులు అరకొరగానే ఉంటున్నాయి. దీంతో ఇప్పటికీ తాత్కాలిక భవనాల్లోనే విశ్వవిద్యాలయం కార్యకలాపాలు నడుస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి చదువుకోవడానికి వచ్చే విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవు. చదువు చెప్పే అధ్యాపకులూ లేరు. వీటి నడుమే గతేడాది మొదటి సంవత్సర బ్యాచ్ కూడా బయటకు వెళ్లింది. ఈ కష్టాలన్నీ చూసి కొత్తగా వచ్చే విద్యార్థులు ఈ యూనివర్సిటీకి రావడానికి భయపడిపోతున్నారు.

ఐదేళ్లుగా నిధులు అరకొరే..

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని 2018వ సంవత్సరంలో అప్పటి మానవ వనరుల శాఖ మంత్రి అయిన ప్రకాశ్ జవదేకర్ ప్రారంభించారు. జెఎన్‌టియు కళాశాలలోని ఇంక్యూబేషన్ కేంద్రంలో తాత్కాలిక క్యాంపస్ కింద దీన్ని ప్రారంభించారు. త్వరితగతిలోనే కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని శాశ్వత ఏర్పాటు చేస్తామని అప్పుడు ఆయన ప్రకటించారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం బక్కరాయసముద్రం మండలంలోని జంతలూరు వద్ద 400 ఎకరాల భూమిని సైతం కేటాయించింది. అయితే ఇది ప్రారంభమైనప్పటికీ నిధుల కేటాయింపులు ఆ స్థాయిలో జరగడం లేదు. 2020-21 సంవత్సరంలో రూ.4.80 కోట్లు కేటాయించారు. 2021-22 సంవత్సరంలో రూ.60.35 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. కానీ సవరించిన బడ్జెట్‌లో దీన్ని రూ.20.11 కోట్లకే కుదించారు. ఇక 2022-23 సంవత్సరానికి గానూ రూ.56.6 కోట్లు మాత్రమే కేటాయించారు. సవరణ బడ్జెట్ రూ.13.08 కోట్లుకు తగ్గిపోయాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.47.40 కోట్లు కేటాయించారు.

వసతి లేదు..అధ్యాపకులూ లేరు..

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చేరేందుకు విద్యార్థులు ఇక్కడికి విచ్చేస్తున్నారు. ఏడు కోర్సులు ప్రస్తుతం నడుస్తున్నాయి. సుమారు 700 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరికి వసతి గృహాలు లేవు. తాత్కాలికంగా వసతిని అధికారులు ఏర్పాటు చేసిశారు. అయితే ఆ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ఇవి అందరికీ సరిపోవడం లేదు. దీంతో విద్యార్థులు బయట ఉండాల్సి వస్తోంది. దీంతోపాటు పూర్తి అధ్యాపక నియామకాలు సైతం ఇప్పటి వరకు జరగలేదు. ఇప్పుడున్న కోర్సులను బట్టి, విద్యార్థులకు అనుగుణంగా 88 మంది అధ్యాపకులు ఉండాల్సి ఉంది. కాని కేవలం 15 మంది మాత్రమే ఉన్నారు. వారు కూడా అతిథి అధ్యాపకులుగానే బోధన చేస్తున్నారు. శాశ్వత నియామకాలు జరిగేది ఎన్నటికో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటికీ శాశ్వత భవనాలకు దిక్కులేదు

ఐదేళ్ల క్రితం విశ్వవిద్యాలయం ఏర్పాటైనా ఇప్పటికీ శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టిన దాఖలాల్లేవు. తాత్కాలిక భవనాల్లోనే ఇప్పటికీ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడా సరైన వసతులు లేక విద్యార్థులు పలుమార్లు విశ్వవిద్యాలయం పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. అయినా వాటి మెరుగునకు చర్యలు చేపట్టలేదు. జంతలూరు వద్దనున్న 400 ఎకరాల భూమి కేటాయించినప్పటికీ ప్రహరీ నిర్మాణాలకే పరిమితమైంది.

నిధులు కేటాయించాలి

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించాలి. విశ్వవిద్యాలయం ఏర్పాటై ఇప్పటికే నాలుగేళ్లు పూర్తయింది. మౌళిక సదుపాల్లేక ఇక్కడ చదివేందుకు వస్తున్న విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు ప్రస్తావిస్తే విద్యార్థులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఇక్కడి సమస్యలు చెప్పుకునేందుకు ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

- సూర్యచంద్ర, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

రమాదేవి హత్య విషయంలో నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రమాదేవి కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐ, కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఇటీవల హత్యకు గురైన నార్పల మండలం, బొందలవాడ గ్రామానికి చెందిన దళిత రమాదేవి కుటుంబ సభ్యులను రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ పరామర్శించారు. గురువారం జిల్లాకు వచ్చిన ఆయన జిల్లా దళిత నేతలతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన వసతులన్నీ ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు సెంట్ల ఇంటి స్థలం, వ్యవసాయ పొలం, మూడు నెలలు నిత్యావసర సరుకులు ఇస్తారని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అక్కడే ఉన్న ఆర్‌డిఒ మధుసూదన్‌కు పలు సూచనలు చేశారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జన్నే చిరంజీవి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు హనుమంతు, రాష్ట్ర కార్యదర్శి ఎన్ఆర్.నరసింహులు, రాయలసీమ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, అప్పా టీం జిల్లా అధ్యక్షులు చిన్న ఆంజనేయులు, యువసేన జిల్లా అధ్యక్షులు శ్రీ రాఘవ, యువసేన వర్కింగ్ ప్రెసిడెంట్ టిసి.నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర, జిల్లా నాయకులు బాల నాగేంద్ర, బండి మహేష్, లక్ష్మీనారాయణ, రాళ్లపల్లి చంద్రశేఖర్, సాకే నరసింహులు, పాలవాయి సుధాకర్, కన్నేపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎస్‌పి ఫక్కీరప్ప దంపతులు

సీతారాముల కల్యాణంలో ఎస్పీ దంపతులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ హెడ్ క్వాటర్స్‌లోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి దంపతులు కుటుంబ సమేతంగా హాజరై సీతారాముల కళ్యాణం నిర్వహించారు. జిల్లాలో వర్షాలు బాగా కురిసి రైతుల ఇంట సిరులు కురియాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోసాలతో జీవించాలని కాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, ఎ.హనుమంతు (ఎఆర్) దంపతులు, ఎస్‌బి సిఐ చక్రవర్తి, డిసిఆర్‌బి సిఐ విశ్వనాథ్ చౌదరి, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్ యాదవ్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్‌పాల్, సరోజ, రామాలయం కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, నాగరాజు, లింగమయ్య, ఆర్ఎస్ఐ లు రాజశేఖర్ రెడ్డి, భాస్కర్, ప్రవీణ్ కుమార్, రమేష్ నాయక్, రిటైర్డ్ పోలీసు అధికారులు, పోలీసు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెన్నా నదిలో పగిలిన కెమికల్ పైప్‌లైన్

ప్రజాశక్తి - పరిగి


మండలంలోని కాలుపల్లి సమీపంలో ఉన్న నిషా గార్మెంట్స్ పరిశ్రమ పనితీరు రోజురోజుకు తీసికట్టుగా మారింది, స్థానికులు ఆరోగ్యపరంగానూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఫ్యాక్టరీ నుండి వచ్చే కెమికల్ పైప్లైన్ ద్వారా వచ్చే కెమికల్‌ను వేస్టేజ్ పదార్థాన్ని ఊరి చివరి ప్రాంతంలో కానీ డంపు ఏరియాకు గాని తరలించాలి. అయితే యాజమాన్యం మాత్రం ఆ కెమికల్ పదార్థాన్ని పైప్ లైన్ ద్వారా నదీ ప్రాంతంలోకి తరలించడం గ్రామస్తుల ఆరోగ్యానికి ముప్పు వాటినే ప్రమాదం ఏర్పడింది.. ఈ పైపులైన్ ద్వారా ఫ్యాక్టరీలోనే వ్యర్థపదార్థాలను సరఫరా చేస్తున్నారో లేక ఈ పదార్థాలు నది ప్రాంతంలోకి రావడంతో వచ్చే నీరు కెమికల్ తో విలీనమైతే ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు తెలిపారు. దీనిపై యాజమాన్యం ఏ మాత్రం స్పందించకుండా మొండి వైఖరి అవలంభిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా నిషా గార్మెంట్స్ యాజమాన్యం స్పందించి పైప్ లైన్ ను మరమ్మతులు చేసి డంపు ఏరియాకు కెమికల్ ను తరలించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పగిలిపోయిన పైపులైను

ఆత్మీయ సన్మానం

కదిరి అర్బన్ : దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జోనల్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకున్న కెవి రమణకు కదిరి పాత్రికేయులు గురువారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. . పట్టణము లో ఆర్ అండ్ బి బంగ్లాలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ పాత్రికేయ వత్తిలో నిబద్ధతతో విధులు నిర్వహించి ,ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కెవి. రమణ నేడు డిక్కీ ద్వారా పలువురిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దారన్నారు. ఈయన భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, శివాజీ, జయచంద్ర రెడ్డి, రామాంజనేయులు, నరేంద్ర రెడ్డి, పందిటి రవి, చంద్రారెడ్డి, అజయ్, నాగ, హరి ప్రసాద్, శంకర్, చంద్ర, రామకృష్ణ, గంగరాజు, రాయుడు తదితరులు పాల్గొన్నారు.



రమణను సన్మానిస్తున్న పాత్రికేయులు

గాలికొచ్చిన ప్రభుత్వం..గాలికే పోతుంది..

దామాషా పద్ధతి ప్రకారం వక్కలిగలకు నిధులు కేటాయిస్తాం

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-పెనుకొండ

గాలికొచ్చిన ప్రభుత్వం.. గాలికే పోతుంది..అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. గురువారం పెనుకొండ మండలం హరిపురం సమీపంలోని విడిది కేంద్రం నుంచి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభమైంది. హరిపురం గ్రామస్తులతో మాటామంతి చేపట్టారు. ఎర్రమంచి వద్ద కియా కార్ల పరిశ్రమ ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించారు. అమ్మవారిపల్లిలో స్థానికులతో భేటీ అయ్యారు. లోకేష్ పాదయాత్ర 700 కిలోమీటర్లకు చేరిన సందర్భంగా గుట్టూరు గ్రామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గుట్టూరులో రహదారి పక్కన వక్కలిగ సామాజిక వర్గీయులతో ముఖాముఖి నిర్వహించారు. పలు సమస్యలను వారు లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్లను నిర్మించాలని కోరారు. వక్క తోటలు, మల్బరి రైతుల ఇబ్బందులను లోకేష్‌కు వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే అందరి సమస్యలూ పరిష్కరిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. జగన్ రాయలసీమ బిడ్డ కాదని.. సీమకు పడ్డ క్యాన్సర్ గడ్డ.. అని ఎద్దేవా చేశారు. గాలికొచ్చిన ప్రభుత్వం..గాలికే పోతుందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దామాషా పద్ధతి ప్రకారం వక్కలిగలకు నిధులు కేటాయిస్తామని అన్నారు. వక్కలిగలను టిడిపి రాజకీయంగా ప్రోత్సహిస్తుందన్నారు. గతంలో వక్కలిగలను మంత్రి, ఎమ్మెల్యే చేసిన ఘనత టిడిపిదే అన్నారు. ఎన్టీఆర్ హయాంలో హెచ్.బి.నరసయ్యకు న్యాయశాఖ మంత్రిగా అవకాశం కల్పించామన్నారు. పట్టు రైతులకు ఈ ప్రభుత్వం పెట్టిన రూ.45 కోట్ల బాకీని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మడకశిరలో వక్క మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సీమకు తెచ్చిన నీరు వృథా కాకుండా డ్రిప్ ద్వారా పంటలకు అందించామన్నారు. 90 శాతం సబ్సీడీతో డ్రిప్ ఇస్తుంటే జగన్ రద్దు చేశాడని తెలిపారు. మడకశిర పరిధిలో టిడిపి హయాంలో పట్టు రైతులకు 1000 షెడ్లు నిర్మించామన్నారు. హంద్రీనీవా కాలువ పనులు 90 శాతం పూర్తి చేశామన్నారు. 10 శాతం పనులు చేయలేని దద్దమ్మ ప్రభుత్వం వైసిపి అని ఎద్దేవా చేశారు. వక్కలిగలను ఒబిసిలో చేర్చడంపై బిసి కమిషన్ నిర్ణయం తీసుకోవాలన్నారు. దీనిపై పార్టీ అధిష్ఠానంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. టిడిపి హయాంలో తెలంగాణలో చదివే ఏపీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చామని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చాక పెద్దలతో చర్చించి కర్ణాటక, తమిళనాడులో చదివే ఎపి విద్యార్థుకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. స్థానికంగా మంచి కాలేజీలు, యూనివర్సిటీలు తీసుకొస్తే బయటకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. వైసిపి ప్రభుత్వం అడ్డగోలుగా బిసిలపై కేసులు పెడుతోందని, టిడిపి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే బిసిల భద్రతకు ప్రత్యేక చట్టాన్ని తెస్తామని స్పష్టం చేశారు. కేసులు రివ్యూ చేయడానికి జిల్లా స్థాయిలో కమిటీ కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు వైసిపి ప్రభుత్వం తొలగించడంతో 16 వేల పదవులను బిసిలు కోల్పోయారన్నారు. టిడిపి స్థాపనతోనే బిసిలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసే బాధ్యతను తెలుగుదేశం ప్రభుత్వం తీసుకుంటుందని నారా లోకేష్ హామీ ఇచ్చారు. అనంతరం లోకేష్ యువగళం పాదయాత్ర చెన్నేకొత్తపల్లి మండలం కోన మలుపు వద్ద విడిది కేంద్రానికి చేరుకుంది. రాత్రి లోకేష్ అక్కడే బస చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నిమ్మల క్రిష్టప్ప, గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసమూర్తి, వక్కలిగ నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

లోకేష్ సెల్ఫీ ఛాలెంజ్

పెనుకొండ క్రాస్ వద్ద నుండి ప్రారంభమైన పాదయాత్ర దుద్దెబండ క్రాస్ మీదుగా కియా కార్ల పరిశ్రమ ముందుకు చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర 700 కిలోమీటర్లకు చేరుకుంది. కియా పరిశ్రమ ముందు లోకేష్ సెల్ఫీ చాలెంజ్ ను ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి కి విసిరారు. టిడిపి ప్రభుత్వంలో అనేక పరిశ్రమలను తీసుకువచ్చామని చెప్పారు. అందులో ఒకటైన కియా పరిశ్రమ ముందు నిలబడి వైసిపి ప్రభుత్వానికి సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్నామన్నారు. వైసిపి ప్రభుత్వంలో తెచ్చిన ఒక్క పరిశ్రమ ముందు అయినా నిలబడి సెల్ఫీ తీసుకోగలరా అని ప్రశ్నించారు. అనంతరం సి కె పల్లి మండలం కోన విడది కేంద్రం కు లోకేష్ పాదయాత్ర చేరుకొని అక్కడే బస చేశారు. ఈ సందర్భంగా లోకేష్ పాదయాత్ర పెనుకొండ నియోజకవర్గం ముగియడం టీడీపీ జిల్లా అధ్యక్షులు బి. కె. పార్థసారథి,టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ నిమ్మల క్రిష్టప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ, నాయకులు కురుబ కృష్ణమూర్తి, టీడీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ పాదయాత్ర లో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ లు బి.టి. నాయుడు, గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సామకోటి ఆదినారాయణ, మునిమడుగు చిన్నవెంకటరాముడు, గుట్టూరు సూర్యనారాయణ, సుబ్బరాయుడు, బోయ నాగరాజు, నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



గుట్టూరులో వక్కలిగ సామాజిక వర్గీయులతో మాట్లాడుతున్న నారా లోకేష్

సోషల్ మీడియాలో శృతిమించిన ఆరోపణలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

నియోజకవర్గంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ముగిసిన తరువాత టిడిపి, వైసిపి నాయకులు ఒకరిపై ఒకరు సవాళ్లు, ప్రతి సవాళ్ల తో దద్దరిల్లిపోతుంది. సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు తీవ్రంగా ఆరోపణలు విమర్శలు, చేసుకొంటూ రచ్చ రచ్చ చేసుకొంటున్నారు. నారా లోకేష్ ఈనెల 25న ఒడిసి బహిరంగ సభ లో వైసిపి రాష్ట్ర నాయకత్వం పైన విమర్శలు చేశారు. ఎమ్మెల్యేను దోపిడీ శ్రీధర్ రెడ్డి అని సంబోధించారు. వారంలో ఒకరోజు మాత్రమే పుట్టపర్తిలో ఉంటాడని ఆరు రోజులు హైదరాబాదు, బెంగుళూరులో తన వ్యాపారాల నిమిత్తం వెళ తుంటాడని లోకేష్ ఆరోపించారు. దీంతో ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. ప్రతి విమర్శలు చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి దీటుగా స్పందించి ఎమ్మెల్యే పై అవినీతి ఆరోపణలు చేశారు. ఏప్రిల్ రెండవ తేదీ పుట్టపర్తి సత్యమ్మ గుడి సర్కిల్‌లో బహిరంగంగా ప్రజల మధ్య ఆరోపణలు, అవినీతిని నిరూపిస్తానని పల్లె సవాలు విసిరారు. ఇక అక్కడ నుంచి అగ్గి రాజుకొంది. వైసిపి ద్వితీయ శ్రేణి నాయకులు అటు టిడిపి నాయకులు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ విమర్శలు, ప్రతి విమర్శలు ఆరోపణలు చేసుకొంటూవస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న పుట్టపర్తిలో రాజకీయ వేడి భగ్గు మంటోంది. ఈ ఆరోపణలు ప్రతి సవాళ్లతో ఎప్పుడు ఏమి జరుగుతోందని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రాజకీయ దుమారం ఎంతవరకు వెళుతోందో అని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇరు పార్టీల అధినేతలు ఈ రాజకీయ చిచ్చును ఇంతటితో ఆపాలని కోరుకొంటున్నారు.

కార్పొరేటర్ల కొమ్ముగాస్తున్న మోడీ


జీపుజాతాలో పాల్గొన్న నాయకులు

పెనుకొండ : కేంద్రంలోని మోడీ ఆధ్వర్యంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల కొమ్ముకాస్తోందని రైతుసంఘం, సిఐటియు నాయకులు విమర్శించారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సిఐటియు, రైతు సంఘం , వ్యవసాయ కార్మిక సంఘం ,కౌలు రైతు సంఘం ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాతా గురువారం పెనుకొండ చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ఉపాధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నాయకత్వంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలు రైతుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తున్నారన్నారు. మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజా అనుకూల విధానాల సాధన కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక పోరాట ప్రదర్శనలో అత్యధిక మంది పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫక్రుద్దీన్, సిఐటియు నాయకులు వజ్రం నాగప్ప, చిన్న వెంకటేష్, తిప్పన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బావమ్మ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : చలో ఢిల్లీ కార్యక్రమం నేపథ్యంలో సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యలో నిర్వహిస్తున్న జీపుజాతా గురువారం రొద్దంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మిక ,కర్షక, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కారం కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, రైతుసంఘ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

పరిగి : ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన జీపుజాతా గురువారం మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామ్య విధివిధానాలపై వచ్చే నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, రైతు సంఘం నాయకులు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఐక్యంగా ఎండగదామని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపు నిచ్చారు. కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలో చేపట్టిన జీపుజాత గురువారం హిందూపురం పట్టణానికి చేరింది. ఈ సందర్భంగా పట్టణంలో ప్రదర్శన నిర్వహించి, అంబేద్కర్ సర్కిలలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరించిందని విమర్శించారు. ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ సంపదను దోచిపెట్టే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి గంగాధర్, సిఐటియు పట్టణ కమిటీ కోశాధికారి రామకృష్ణ, ఉపాధ్యక్షులు అత్తరు బాబా, నాయకులు చంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కల్లూరు ఆటో స్టాండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రఫీక్, పరిగి మండల సిఐటియు కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్త ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతు , వ్యవసాయ కార్మిక , సిఐటియు , కౌలు రైతు

జీపుజాతాలో నాయకులు

ఉమ్మడి సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమం నేపథ్యంలో జిల్లాలో రెండు రోజుల క్రితం ప్రారంభమైన జీపు జాత గురువారం సోమందేపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా వాల్మీకి సర్కిల్ నందుకు చేరుకుంది. అక్కడ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజాభివృద్ధే ధ్యేయం అంటూ హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం చేతలతో బడా కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. రైతుల పంటలకు కనీస గిట్టుబాటు మద్దతు ధర, చట్టబద్ధం చేయకుండా కాలయాపన చేస్తూ రైతులను వ్యవసాయానికి దూరం చేసే విధంగా చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు ఫక్రుద్దీన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వెంకటరాముడు, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ , హనుమంత రెడ్డి , కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి, అంగన్వాడి యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి శ్రీదేవి , చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి రాజగోపాల్ , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప , ఆవాజ్ మండల అధ్యక్ష , కార్యదర్శులు మాబు, చాంద్ బాషా, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు శీలా నారాయణస్వామి, బెస్త క్రిష్టప్ప , ఉప్పర కిష్టప్ప , భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు నాగభూషణ , సిఐటియు మండల నాయకులు కొండా వెంకటేశులు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు రవి , మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండల పరిధిలోని వడ్డుపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన బోయ రామచంద్ర (52), భార్య ముత్యాలక్క (48) ఆత్మకూరు నుంచి అనంతపురం ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా వడ్డుపల్లి సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. రామచంద్ర ఆర్టీటీ సంస్థ ప్రధాన కార్యాలయంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్య ముత్యాలక్క అనంతపురంలో పూలు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. ఇందులో భాగంగానే భార్యాభర్తలు ఇద్దరూ రోజూ ఆత్మకూరు నుంచి అనంతపురానికి వచ్చి వెళ్తుండేవారు. ఈనేపథ్యంలోనే ఇద్దరూ తెల్లవారుజామున అనంతపురానికి వెళ్తుండగా ఐచర్ రూపంలో మృత్యువు వెంటాడింది. మృతులకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి ఉన్నట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంగడుయాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


మృతులు రామచంద్ర, ముత్యాలక్క (ఫైల్‌ఫొటో)

పేకాట జూదరులు అరెస్టు

చిలమత్తూరు : మండల పరిధిలోని తిమ్మరెడ్డిపల్లి, కాపుచన్నంపల్లి గ్రామ శివారు ప్రాంతాలలో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురు పేకట జూదర్లను అరెస్టు చేసి వారి నుండి 7 మోటర్ సైకిళ్లు, 64,700 రూపాయలు నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

కనగానపల్లి : మండల పరిధిలోని ముత్తువ కుంట్ల గ్రామానికి చెందిన రత్నమ్మ (43) గురువారం అదృశ్యం అయినట్లు కనగానపల్లి పోలీస్టేషన్‌లో ఆమె తల్లి పిర్యాదు చేసినట్లు ఎస్.ఐహనుమంతరెడ్డితెలిపారు. రత్నమ్మ అనంతపురం నగరం పరిధిలోని అజయ్ ఘోష్ కాలనీలో ఉన్న తన మేనత్త మారెక్క ఇంటికి వెళ్ళివస్తానని చెప్పి అక్కడికివెళ్ళకుండా కనిపించకుండా పోయినదని ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

చిరుధాన్యాల ప్రయోజనాలపై అవగాహన

మడకశిర : మండలంలో కల్లుమరి గ్రామంలో జరిగిన పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా కల్లుమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిరుధాన్యాలు వాటి ఉపయోగాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎంపిహెచ్ రామప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మడకశిర సిడిపిఒ నాగమల్లేశ్వరి గర్భవతులు మహిళలు బాలింతలకు చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కల్లుమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినోద్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ ధనలక్ష్మి, సూపర్వైజర్ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైన తాపీమేస్త్రీ కుమారుడు

ధర్మవరం టౌన్ : అనంతపురం జిల్లాకోర్టులో పలు ఉద్యోగాలకు పరీక్షల ఫలితాలు ఈనెల 29న విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ధర్మవరానికి చెందిన బులగొండ్లశ్రీనివాసులు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఓపెన్ క్యాటగిరిలో 71.08మార్కులు సాధించి మూడవ స్థానంలో నిలిచి ఉద్యోగం సాధించాడు. ధర్మవరానికి చెందిన బులగుండ్ల నాగరాజు తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుమారుడు శ్రీనివాసులును చదివించాడు. కుమారుడు జూనియర్‌అసిస్టెంట్ ఉద్యోగం సాధించడం పట్ల అతని కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

బాలుడి వైద్యసేవలకు ఆర్థికసాయం

హిందూపురం : పట్టణంలోని 3వ వార్డు ఆర్‌టిసి కాలనీలో నివాసం ఉంటున్న లావణ్య కుమారుడు తీవ్ర ఆనారోగ్యంతో బాధపడుతున్నాడు. తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిని లావణ్య స్థానిక ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు వివరించింది. వెంటనే స్పందించిన ఆయన బాలుడి సర్జరీ కోసం రూ. 50వేలు అందజేశారు. దీంతో పాటు బెంగళూరు మహావీర్ జైన్ అసుపత్రికి వెళ్లడానికి తగిన ఏర్పాట్లు చేయాలని లతీఫ్‌సేట్‌ను సూచించారు. వెంటనే ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి బెంగళూరుకు తరలించారు. విషయం చెప్పిన వెంటనే మానవత్వంతో ఆదుకున్న ఎమ్మెల్సీకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

3న పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్ : వృద్ధులకు, వికలాంగులకు, వితంతు, ఒంటరి మహిళలకు, ఏప్రిల్ 3న పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులకు, వాలెంటీర్లకు ఈ విషయమై ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి నెల 1న పింఛను అందించేవారమని అయితే ఈనెల 31 నుంచి ఏప్రిల్ 2 వరకు సెలవులు ఉండటంతో పింఛన్ పంపిణీ కార్యక్రమం ఏప్రిల్ 3కు మార్చామని వివరించారు.

చలివేంద్రం ప్రారంభం

గోరంట్ల : మండలంలో పాలసముద్రం క్రాస్‌వద్ద వెంకటేశ్వర సప్లయర్స్ ప్రొప్రైటర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్ర కేంద్రాన్ని గ్రేట్ వ్యవస్థాపకులు వెంకటేశ్వరరావు గురువార ప్రారంభించారు పాలసముద్రం గ్రామ క్రాస్‌లో చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేడు నీలకంఠాపురంలో సామూహిక వివాహాలు

మడకశిర : మండలంలోని నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరు ఆలయంలో శుక్రవారం సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి రఘువీరారెడ్డి తెలిపారు. 1982 నుండి నేటి వరకు నిరంతరం ప్రతి ఏటా శ్రీరామ నవమికి సామూహిక వివాహాలు ఇక్కడ నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. దాదాపు 5వేల మందికి పైగా నిరుపేద వధూవరులు ఈ వేదికమీద ఒక్కటయ్యారు. మాజీ పార్లమెంటేరియన్, స్వాతంత్ర సమరయోధుడు నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి నీలకంఠేశ్వర దేవాలయాన్ని నిర్మించారు. ఇక్కడ సామూహిక వివాహాలకు1982లోనే నాంది పలికారు. శ్రీరామిరెడ్డి ఆశయాలను మాజీ మంత్రి రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు నిరంతరం కొనసాగిస్తూ రాజకీయాలకు అతీతంగా ఇక్కడ వివాహాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 30న శ్రీరామనవమి వేడుకలు, 31న సీతారాముల కళ్యాణం, సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి రఘువీరారెడ్డి తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీన ఉట్ల మాను పరుష నిర్వహించనున్నట్లు చెప్పారు.

నారా లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-కనగానపల్లి

రాప్తాడు నియెజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి మండలం కోన సమీపంలోకి నారా లోకేష్ పాదయాత్ర చేరుకున్న సందర్భంగా మాజీమంత్రి పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ నేతృత్వంలో టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా మాజీమంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ నారా లోకేష్ కు పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. వీరితో పాటు మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు బికె.పార్థసారథి నారా లోకేష్ కు స్వాగతం పలికారు. మహిళలు పెద్ద ఎత్తున కలిశాలతో నారా లోకేష్‌కు స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల కన్వనర్ యాతం పోతులయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


నారా లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న పరిటాల సునీత, శ్రీరామ్, తదితరులు

విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని కరావులపల్లి తండా సమీపాన పుట్టపర్తి రోడ్డులో పారిశ్రామికవేత్త శంకర్ నాయక్ ఆధ్వర్యంలో నూతనంగా శివుని విగ్రహం ఏర్పాటు చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శంకర్ నారాయణ హాజరయ్యారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప విగ్రహ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు . ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎద్దుల బండ్ల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జయరాం నాయక్, లాయర్ తిప్పే నాయక్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు


ధర్మవరంలో శ్రీరామనవమి వేడుకలు


బుక్కపట్నంలో ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాత

గాండ్లపెంట : మండల కేంద్రంలోని రామాలయ ఆలయంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు ప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. రామాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కొత్తచెరువులో మరువ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న రామాలయంలో స్వామివారికి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలో ని ఫోర్ వీలర్స్ ఓనర్లు డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా శ్రీరామనవమి వేడుకలు జరుపుకున్నారు. నవమిని పురస్కరించుకొని సంఘం కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ప్రజలకు భక్తులకు పానకం పెసర బేడలను పంచారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, దాల్ మిల్ రవి, శేఖర్ రెడ్డి, డ్రైవర్ల సంఘం నాయకులు సంజీవ గౌడు, వీరప్ప, సోము, రవి తదితరులు పాల్గొన్నారు .

బుక్కపట్నం : శ్రీరామనవమి పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని కృష్ణాపురం , గునిపల్లి, పాముదుర్తి తదితర గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామ దేవాలయాల వద్ద పానకాలను పంపిణీ చేశారు. మండల కేంద్రంలో వేడుకలను ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వేడుకలను ఘనంగా ఘనంగా నిర్వహించారు. అతి పురాతనమైన రామస్వామి ఆలయ గుడి పునర్నిర్మాణానికి విరాళాలు సేకరించగా గ్రామానికి చెందిన దాతలు పెనుజురి లక్ష్మయ్య, రాజు తమ వంతు సహాయంగా 50 వేల రూపాయలను శ్రీరామ సేవా సమితి ట్రస్టు అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ దాదాపు కోటి రూపాయల వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు సేవా సమితి ట్రస్ట్ ముందుకొచ్చిందని దాతలు తమ వంతు సాయం చేసి గుడి పునర్నిర్మాణంలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మడకశిర : మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండల లోని దేవాలయాల్లో భక్తుల కోలాహల నడుమఘనంగా నవమి వేడుకలు జరుపుకున్నారు. నీలకంఠాపురంలోని దేవాలయంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆయన సతీమణి సునీత రఘువీర్ నీల కంఠేశ్వర దేవాలయంలో సీతారాముల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని మెట్టబండ ఆంజనేయస్వామి, కోట వెంకటరమణ స్వామి షిర్డీ సాయిబాబా, కన్యకా పరమేశ్వరి దేవాలయం, ఒడిసెలమ్మ దేవాలయం ఊరు మారమ్మ దేవాలయం, పశువుల ఆంజనేయస్వామి, శ్రీ చంద్రమౌళీశ్వర దేవాలయం ఆంజనేయస్వామి జిల్లడగుంట వైబిహల్లి, చందకచర్ల, ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఉత్సవాలు నిర్వహించారు.

రొద్దం : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీరాముని అలయాలతో పాటు ఆంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆర్. కొట్టాల, ఆర్. మరువపల్లి, రొద్దం తదితర గ్రామాలలో వేడుకలు నిర్వహించారు.

గుడిబండ : మండలంలోని శంకర గళ్ళు. కొంకల్లు. హిరేతూర్పి. బిటి. పల్లి, కురబరపల్లి, మద్దనకుంట, గుడిబండ, మోరుబాగల్, చిగతుర్పి, కేకాతి, బూదిపలిల తదితర గ్రామల్లో శ్రీరామినవమి వేడులకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన భక్తు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పుట్టపర్తి అర్బన్ : ప్రశాంతి నిలయంలో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలు లో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్ జె రత్నాకర్ ఆధ్వర్యంలో వేద పండితులు సీతారాముల కల్యాణానిన నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి దేశ విదేశీ భక్తులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని గోకులం, మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లిలో శ్రీరామ గుడిలో కళ్యాణోత్సవంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. సాయంత్రం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు సీతారాములను ట్రాక్టరు, ఎద్దుల బండి లో ఊరేగించారు. పలుచోట్ల ఉట్లు మాను పరుషను నిర్వహించారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 39వ వార్డులో కోదండరామాలయంలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. భక్తుల కోలాహలం, మంగళవాయిద్యాల నడుమ వేదపండితులు సీతారాముల కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవానికి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున దంపతులు. కౌన్సిలర్ కడపరంగస్వామి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు కూర్చుని నిర్వహించారు. అనంతరం అలయకమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు.


మడకశిరలో నిర్వహించిన కార్యక్రమంలో రఘువీరారెడ్డి

హిందూపురం : నవమిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో పలు ప్రాంతాలలో సీతారాముల కళ్యాణోత్సవం జరిగింది. సూగూరు అంజినేయ స్వామి, ముద్దిరెడ్డిపల్లిలోని శ్రీరంగనాథస్వామి, డిఆర్ కాలోనిలోని శ్రీరాముని ఆలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ, ఆలయ ధర్మకర్తలు పాల్గోన్నారు. సూగురు అంజినేయ స్వామి ఆలయంలో స్వామి వారి శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా కళ్యాణోత్సవం, రథోత్సవం జరిగింది. సాయంత్రం ఉట్ల పరుష నిర్వహించారు. ఇందులో విజేతలకు రూ.15వేల నగదు బహుమతితో పాటు బంగారు డాలరును ఎమ్మెల్సీ ఇక్బాల్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అందించారు. రాత్రి 7 గంటల నుండి లంకాదహన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పట్టణంలో వివిద ఆలయాల్లో జరిగిన కళ్యాణోత్సవాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.పట్టణంలోని స్వచ్ఛంద సేవకులు ఉమర్ ఫారూఖ్ ఖాన్, షబ్బీర్ శ్రీరామ నవమిని పురష్కరించుకుని రంజాన్ ఉపవాసం ఉంటూ భక్తులకు చిన్నమార్కెట్ వద్ద మంచి నీళ్లు, పానకం, మజ్జిగ, పెసరబ్యాళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్ కుమార్, ఆటో సంజీవ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి



ఆందోళనలో పాల్గొన్న నాయకులు

ఆందోళనలో విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని టేకులోడు గురుకుల పాఠశాల (మహాత్మ జ్యోతి రావు పూలే బాలికల రెసిడెన్షియల్ వసతి గృహం)లో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థిని మహిత (14) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. ఈ నేపథ్యంలో విద్యార్థిని మృతికి గల కారణాలపై విద్యార్థి సంఘం నాయకులు పాఠశాల విద్యార్థులతో గురువారం విచారించారు. అనంతరం నాయకులు స్థానిక విలేకరులతో మాట్లాడారు. గొంతు నొప్పితో బాధపడుతున్న విద్యార్థిని ఎఎన్‌ంకు చెప్పుకోగా ఆమె 'నాటకాలు ఆడుతున్నావా' అని మందలించిందన్నారు. అనారోగ్యంతో కనీసం శ్వాస తీసుకోవడానికి బాధపడుతున్న విద్యార్థినితో వారం రోజుల క్రితం పీఈటీ గ్రౌండ్ లో 6 రౌండ్లు కొట్టించిందని తోటి విద్యార్థినులు తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. తీవ్ర అనారోగ్యం పాలైన విద్యార్థినిని వారి బందువులు ఆసుపత్రికి తీసుకెళుతుండగా మృతిచెందిందని చెప్పారు. విద్యార్థినిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థిని మృతికి కారణమైన ఎఎన్ఎం, పిఇటి, క్లాస్ ఇన్‌ఛార్జిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురుకుల పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు.పాఠశాలలో ఇలాంటి నిర్లక్ష్య పరిస్థితులు ఉన్నా కనీసం పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మండల వైద్యాధికారి రామక్రిష్ణ పాఠశాలలో విద్యార్థులకి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఎపిఎస్ఎఫ్ నాగభూషన్, ఎంఎస్ఎఫ్ రవికుమార్, ఎస్సీ ఎస్టీ విజలెన్స్ అండ్ మానటరింగ్ సభ్యుడు శంకరయ్య, ఎహెచ్ఒ పౌండేషన్ కో పౌండర్ ఎన్‌జీవో బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.